# పేపర్‌పార్కు

"ప్చ్... ఏమో !... అదంతా నాకిష్టం లేదురా !" మాటలు చప్పరించాను అనుమానంగా.

"మరోసారి ఆలోచించుకోరా !" శేఖర్ పట్టువీడలేదు.

"నుదిటిరాత అందల మెక్కిస్తానంటే నోటిమాట బురదగుంటలో బొర్లుమందిట. ఇంత పెద్ద టౌన్లో ఇంటిస్థలం ఉత్తపుణ్యానికే ఇప్పిస్తానంటే... మీకేమైందండీ ?" అర్థాంగి శారద కాటుక కళ్లను కలగాపులగంగా తిప్పేసింది. "మా అన్నయ్య మనసు వెన్నపూస. మనమంటే ఎంతో అభిమానం కదా ! మున్సిపల్ కమీషనర్‌గా ఈ ఊరొచ్చాడు. సాయం చేస్తానంటున్నాడు. మీరిన్నాళ్ళు ఉద్యోగం వెలగబెట్టినా పట్టుమని పదిగజాల సొంతిల్లు సంపాదించారా ? కనీసం ఓ ఖాళీ జాగానన్నా కొనిపెట్టారా ! ఇద్దరు పిల్లలకు తండ్రయ్యారు కాని ఇంగితజ్ఞానం శూన్యం".

"చాల్చాలు నీ ఉపన్యాసం" రోషం పొడుచుకొచ్చి మాటలు తెగ్గొట్టాను. "శేఖర్ మున్సిపల్ కమీషనరై మనూరికొచ్చినందుకు సంతోషిద్దాం... కాని వాణ్ని అధికార దుర్వినియోగానికి పాల్పడమనడం అన్యాయం శారదా".

"ఒరేయ్ ! నువ్వింకా కొన్ని శతాబ్దాల వెనకున్నావురా". శేఖర్ ఊరుకోలేదు, "ఇది హైటెక్ యుగం బాబూ ! చూడు నాయనా ! నేను ఇళ్ల స్థలాలిస్తున్న జాగా నాది కాదు. గానుగలోంచి గరిటెడు నూనె అన్నట్లు ప్రభుత్వ భూమిని ప్రజలకు... అంటే అల్పాదాయ వర్గాల వారికి పంచెయ్యాలనేది ప్రభుత్వాశయం. నేను దాన్ని అక్షరాలా అమలు చేస్తున్నానంతే".

"మరి... మరి నాది అల్పాదాయ వర్గమేనా ?"

"నాబొంద ! నువ్వెంత అమాయకుడిరా !"

"అమాయకుడినా !" అయోమయం ఆవహించింది.

"కాదా మరి. ఇంటి స్థలం కేటాయింపుకోసం అప్లై చేస్తుంది నువ్వు కాదు. మా చెల్లాయి.. ఓ గృహిణి. శారద కెంత ఆదాయముందో చెప్పు" నవ్వేశాడు. శారద కూడా శృతి కలిపింది. "ఇది కలియుగంరా బాబూ ! అమాయకులు అంతటా వెనకబడిపోతారు. అయినా నువ్వేమన్నా చేతకాని, చేవలేని దద్దమ్మవా ?" ఛాలెంజి విసిరాడు.

'ఊహూఁ ! నేను చేతకాని, చేవలేని వాణ్నెందుకన్పించుకోవాలి ? అయినా ప్రాణస్నేహితడు కమీషనర్‌గా ఉన్నప్పుడు కాపోతే పనులు చేయించుకునే గోల్డెన్‌ఛాన్స్ మళ్లీ వస్తుందా !'

"బతకలేక బడిపంతులనే సామెతకు కాలం చెల్లిందండీ" శ్రీమతి చురకలంటిస్తూనే ఉంది. "మీరిప్పుడు బతుకనేర్చిన బడిపంతులు. పేరు నాది పైరవీ మీది. చేసేది అన్నయ్య.

చూసేది లోకం" నేర్పుగా, ఓర్పుగా కూడా మాట్లాడేస్తుంది. నాలో పౌరుషాగ్ని రగిలింది.

"సరే... కానియ్. అప్లికేషన్ రాసెయ్"

రాసి రెడీగా ఉన్న అప్లికేషన్ మీద శారద సంతకించింది.

"నువ్వోసారి మా ఆఫీసుకు రారా !" అంటూ వెళ్ళిపోయాడు శేఖర్.

గర్వం పులుముకున్న శారద గమ్మత్తు చూపుల సొగసు చూడతరమా ! తుమ్మెద రెక్కల్లా కొట్టుకుంటున్న కనురెప్పలు 'మాశేఖర్నయ్యంటే మాటలా మజాకా' అంటున్నాయి.

బెత్తెడు ఖాళీ జాగాలేని ఈ మెగా టౌన్లో ఇళ్ళస్థలాల కేటాయింపుకు స్థలమెక్కడ సేకరిస్తారో ! ఎవరికి, ఎలా పంచుతారో ! ఈ వ్యవహారంలో ఎవరెంత దండుకుంటారో !

రాత్రి భోజనాలయాక సందేహాలన్నీ శారదమీద కుమ్మరించాను - బుర్ర గోక్కుంటూ. మా ఇద్దరు పిల్లలప్పటికే నిద్రలోకి జారుకున్నారు.

"రాజు తలచుకుంటే దెబ్బలకొ్కదవా అన్నట్లు కమీషనర్ తలుచుకుంటే ఖాళీ జాగాలకొ్కదవా ?" అంది పరుపుమీద పవళిస్తూ. ఆలూ మొగలు ఎవరినెవరు ప్రసన్నం చేసుకోవాలన్నా అనువైన సమయమదే కదా ! కాని... నా బుర్రను తొలుస్తున్న అనుమానం పెనుభూతమైందప్పటికే.

"అదే శారదా ! అదెలా సాధ్యమవుతుంది ." ఓచేత్తో బుర్ర గోక్కొంటూ మరో చేత్తో జుట్టు పీక్కున్నాను.

"అబ్బబ్బా ! మీరలా అర్థం పర్థం లేకుండా ఆలోచిస్తూ బుర్ర గోక్కుంటే బుర్ర బుర్రైపోతుంది. జుట్టు పీక్కుంటే తలకాయ బోడిగుండవుతుంది" చటుక్కున అటు తిరిగింది.

"అంతేకాని నీ జవాబేమిటో చెప్పిచావవు కదా !" పురుషాహంకారం పురివిప్పింది. నేను బిగుసుకుపోతున్నానని కనిపెట్టినట్టుందేమో వయ్యారంగా ఇటు తిరిగింది.

"అది కాదండీ !" చెక్కిళ్లమీది చిరునవ్వుతో లేచి కూర్చుంది. "ప్రభుత్వ భూముల్లేకపోతే ప్రైవేట్ భూములనైనా కొని ప్లాట్లుగా చేసి అలాట్ చేస్తారండీ. వడ్డించేవాడు మనవాడు కాబట్టి మనకో ప్లాట్ వచ్చి తీరుతుంది" చెట్టుమీంచి రాలిన పూవులా నా ఒడిలో వాలి ఒదిగిపోయింది. "ఆ తర్వాత చీటీ పాడేద్దాం. దానికితోడు మీ జి.పి.యఫ్ విత్‌డ్రా చేద్దాం. అంతాచేసి ఓ అందమైన ఇల్లు కట్టుకుందాం. ఇంటి ముందు గులాబి, కనకాంబరాల పూలమొక్కలు, ఇంటివెనక జామ, దానిమ్మ చెట్లు, తులసిగద్దె... సొంతింట్లో ఉన్నంత తృప్తి అద్దింట్లో ఉంటుందా!" బుగ్గ గిల్లింది. నరాలు నాట్యమాడినై.

ఆహా... ఓహో ! నందనవనంలో విహరిస్తూ ఐస్‌క్రీంలు తింటున్నంత హాయిగా ఉంది. ఆశల ఊసులు ఆకాశాన్నంటుకున్నై.

"అవును. మనం సొంతింట్లో హా... యి.. గా ద...ర్జాగా ఉండొచ్చు శారదా" పట్టెమంచం పుష్పకవిమానంలా కన్పించింది. కితకితలు పెట్టాను. లైటారిపోయింది.

"అదీ ! మావారు... మా మంచివారు..."

వారం గడిచింది. శేఖర్ ఈ ఊరొచ్చి ఆరేడు నెలలైనా వాళ్లాఫీసుకెళ్లే అవసరం కానీ ఆగత్యంకాని ఇంతవరకు కలుగలేదు. ఇప్పుడు తప్పదు. బడికి సెలవు చీటీ పంపి మున్సిపల్ ఆఫీసుకెళ్లాను. నేరుగా, దర్జాగా వెళ్లి కమీషనర్ ముందు కూర్చున్నాను.

"హమ్మయ్య... ఇప్పుడు దొరికిందా సమయం" ఫైల్లోంచి తలెత్తి మందహాసం చేశాడు శేఖర్. అది నన్నెంతో మురిపించింది.

"అవును. మాది ప్రైవేట్ స్కూల్ కదా ! బోలెడన్ని ప్రైవేట్ క్లాసులుంటాయి".

వేడి చాయ్ వచ్చేసింది.

"చెప్పరా విశేషాలేమిటీ ?" అడిగాడు చాయ్ తీసుకొమ్మని సైగ చేస్తూ. పనుల ఒత్తిడిలో అసలు సంగతి అడుగున పడిందేమో ?

"అదేరా..." నీళ్లు నమిలాను. చాయ్ రుచి తెలీడం లేదు.

"అదంటే ఏమిట్రా ? చెల్లాయి, పిల్లలు కులాసాయేనా ?"

"అంతా క్షేమమే... కా... నీ... "

"అరె... ఆ కానీ అణా ఏమిట్రా ? ఖూనీ చేసొచ్చినట్టు ఏమిటా వాలకం..."

"అబ్బా... అది కాదురా, మీ చెల్లాయ్.."

"ఏమైందిరా మా చెల్లాయ్‌కి ?"

"అబ్బా.. అదేరా.. ఇళ్ల స్థలాల సంగతి కనుక్కొని రమ్మందిరా ?"

"ఓస్ అదా !" ఖాళీ చాయ్ కప్పు దభీన టేబుల్ మీదుంచాడు. నా కప్పు సగమే ఖాళీ అయింది. నా ఉత్సాహంలాగే మిగతా చాయ్ చల్లారిపోయింది. అటెండరొచ్చి కప్పులు తీసుకెళ్లాడు.

"నేనూ... ఆ ప్రయత్నంలోనే ఉన్నాను"

"అదెన్ని రోజుల్లో సాధ్యమౌతుంది ?"

"అంతా అయ్యేసరికి నెలదాటవచ్చు. కాని... ఇల్లు వెంటనే కట్టేయ్యాలి. ఖాళీ స్థలాన్ని ఖాళీగా ఉంచేస్తే దురాక్రమణలను తట్టుకోలేంరా !" వార్నింగిచ్చాడు.

"అట్లా ఏమీ కానివ్వను" ధైర్యంగా అనేశాను.

"సరే ! డబ్బు సమకూర్చుకుని రెడీగా ఉండు" గట్టి హామీ.

ఆలస్యం అమృతం విషమన్నారు కదా ! వెంటనే జి.పి.యఫ్. విత్‌డ్రాయల్‌కు అప్లై చేశాను. ఖర్చులకు వెనకా ముందాడకుండా వారంరోజుల్లో డబ్బు లెక్కబెట్టుకున్నాను. ఈ విషయం శేఖర్ చెవిలో వెయ్యాలి కదా ! వాళ్లాఫీసుకెళ్లి చెప్పేశాను. మరిచిపోయిందేదో గుర్తుకొచ్చినట్టు.

"ఆ... అవును కదూ !" అంటూ నుదురు కొట్టుకున్నాడు. ఆ తర్వాత సీనియర్,

జూనియర్ అసిస్టెంట్లను, సానిటరీ ఇన్స్పెక్టర్లను పిలిచి "పట్నంలో ఖాళీ జాగా ఎక్కడుంద"ని అడిగాడు. అందరి మొహాలు ప్రశ్నార్థకాలై పోయినై. పరీక్షలో కొరకరాని కొయ్యలాంటి పరీక్షకు కంపల్సరీ ఆన్సర్ చెయ్యాల్సి వచ్చినట్టు శూన్యంలోకి చూస్తున్నారు. సంతాపం పాటిస్తున్నట్టు రెండు నిమిషాలు మౌనంగా గడిచినై. అదే ప్రశ్న మళ్లీ అడిగాడు శేఖర్.

పట్టనం మ్యాప్ తెప్పించి ఆమూల నుండి ఈమూల దాకా అణువణువూ పరిశీలించారు. ఎంత వెతికినా అంగుళం జాగా కూడా దొరకదని ఏకగ్రీవంగా తేల్చిపారేశారు.

"ఇది మన ప్రిస్టేజ్ క్వశ్చన్. మిగతా మున్సిపాల్టీలన్నీ ఎన్నో ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తుంటే మనం చేతులు ముడచుక్కూచుందామా ! ఎంతో కొంత భూమి సేకరించి ఇళ్ల స్థలాలుగా మార్చి కొందరికైనా పట్టాలివ్వాలి" పట్టుబట్టాడు శేఖర్.

తర్జన, భర్జనలు, చేతులు పిసుక్కోవడాలు, చెవులు కొరుక్కోవడం, సైగలు చేసుకోవడం యధేచ్ఛగా కొనసాగినాయి. అయినా శేఖర్ వాళ్లనొదిలి పెట్టలేదు. మధ్యాహ్నం రెండు దాటింది. కడుపులో ఆకలి కేకలు ఆవురావురుమంటున్నై.

"సార్ ! మన మున్సిపల్ పరిధిలో పార్కులు తప్ప ప్రభుత్వ భూములేమీ ఖాళీగా లేవు సార్ !" నిర్మోహమాటంగా అన్నాడొకాయన లేచి నుంచుంటూ. అందరినీ వెళ్లమని సీనియర్ అసిస్టెంట్ని ఉండమన్నాడు శేఖర్. మళ్లీ సమాలోచన కొనసాగింది. మ్యాపును మళ్లీ పరిశీలించారు. పట్టణానికో మూలన పాడుబడిన పార్కును ఇళ్ల స్థలాలుగా మార్చేందుకు అనువుగా ఉందని నిర్ణయించారు. అక్కణ్నుంచి వాణ్ని నేరుగా మాఇంటికి లాక్కొచ్చాను.

"వదినా పిల్లలు హైదరాబాద్లో, నువ్విక్కడ ... ఇలా ఎన్ని రోజులు తిప్పలు పడ్తావన్నయ్యా !" అడిగింది శారద అన్నం వడ్డిస్తూ.

"మరేం చెయ్యాలమ్మా ! పెద్దవాడు మెడిసిన్. చిన్నవాడు ఇంజనీరింగ్... ఇద్దరు కొడుకుల చదువు పూర్తయ్యేదాకా నా బతుకింతేనమ్మా"

"అన్నట్టు... ఆ రెండూ డొనేషన్ సీట్లే కదరా !"

"అవును. నానా గడ్డి కరిచి సంపాదించాను !"

"హోటల్ తిండి ఆరోగ్యానికి హానికరం కదన్నయ్యా. ఆ ఉండేదేదో మాఇంట్లోనే ఉండి ఆ రెండు ముద్దలేవో మాతో పాటు నువ్వు కూడా..."

"అమ్మమ్మా... అలా కుదరదమ్మాయ్. నాకు గవర్నమెంట్ ఇచ్చిన క్వార్టరుంది. ఊపిరి సలపని పనులుంటై. ఏపూట కాపూట ఎవరితోనో హోటల్ కెళ్లడం అలవాటైంది." చారు కలుపుకుంటున్నాడు.

"అదికాదురా. పార్కును కన్వర్ట్ చేసే అధికారం మొత్తం నీదేనా ?" బుర్రను కుమ్మరి పురుగులా తొలిచేస్తున్న అనుమానం అడిగేశాను మజ్జిగ కలుపుకుంటూ.

"ఐదేళ్ల టర్మ్ ఐపోయింది కాబట్టి ఇప్పుడు ప్రజలెన్నుకున్న మున్సిపల్ కౌన్సిల్ రద్దయింది

కదా ! అధికారమంతా నాలాంటి కమీషనర్ అండ్ స్పెషల్ ఆఫీసర్లదే కాకపోతే ఫార్మల్‌గా పైకి రాస్తే అప్రూవల్ వచ్చేస్తుంది"

హమ్మయ్య ! అయితే ఫరవాలేదు ! ఉడుకుమోత్తనము ఆవరించిందేమో శారద మూతి, ముక్కు మూడేసి వంకర్లు తిరిగినై

"మా అన్నయ్య ఏది చేసినా అల్లాటప్పాగా చెయ్యరు. మీరేమీ భయపడాల్సిన అవసరం లేదు మహాప్రభూ !"

అన్నాచెల్లెళ్లతో పాటు నేనుకూడా నవ్వేశాను.

"రేపోసారి స్పాట్ మీదికెళ్లి చూసొద్దాం. నువ్వోసారి రారా !"

"తప్పకుండా వస్తారన్నయా !" శారదే హామీ ఇచ్చింది.

అదేరోజు చీటీ పాడేశాను. పోటీపడి గతనెలకంటే ఎక్కువగా పాడాల్సివస్తుంది. సొంతిల్లు కళ్లల్లో తిరుగుతూనే ఉంది.

అటు క్యాజువల్ లీవు పడేసి ఇటు మున్సిపల్ ఆఫీస్‌కెళ్లాను. సీనియర్ సానిటరి ఇన్‌స్పెక్టర్ స్థానికుడయాడట. అతన్నే పిలిచి ఆ పాడుబడ్డ పార్కు ఎక్కడుందో చూపించాలన్నాడు.

అదేదో బూతుమాట విన్నట్టు సీనియర్ సానిటరి ఇన్‌స్పెక్టర్ మొహం సీతాకోకచిలుక లాగైంది.

"అబ్బె... మనం దాని తెరువు పోవద్దుసార్ !" కుంచించుకున్నాడు.

"ఏం... ఎందుకు ?"

"మనకది పనికిరాదు సార్ !" కుర్చీలో ఇమడలేకపోతున్నాడు.

"అందుకనే కదా ఇళ్ల స్థలాలుగా మార్చేద్దామన్నది"

"దాన్ని గురించి మరిచిపోవాలి సార్ !"

"మరచిపోవాలా... ఎందుకంట !"

"అదంతే సార్. కావాలంటే మన సీనియర్ బిల్ కలెక్టర్ కాశయ్యను అడగండి" మరోమాటకు అస్కారమివ్వలేదు.

నా ఉత్సాహం నీరుగారిపోయింది.

ఇదేమిట్రా అన్నట్టుగా చూశాను. నువ్వు కాస్తాగు అన్నట్టుగా సైగ చేశాడు.

"దయచేసి ఈ ప్రపోజల్ డ్రాప్ చేసుకోండి సార్ !" వినయం ఒలకపోశాడు కాశయ్య. వీడేవేవో అడుగుతున్నాడు. అతడేదో చెబుతున్నాడు. కాని... అసలు సంగతేమిటో నా అవగాహన కందలేదు.

"అదెట్లున్నా సరే... నిర్ణయం నిర్ణయమే. ఈరోజు సాయంత్రం మనమా స్పాట్ కెళ్లాల్సిందే"

"నేను మాత్రం రాలేనుసార్ !" కోరస్‌గా అనేసి ధైర్యంగా వెళ్లిపోయారు. గుడ్లు మిటకరించి చూడ్డం నావంతైంది.

వీడో ఆఫీసర్, వాళ్లు సబార్డినేట్సా ! మున్సిపల్ మురికిగుంటలో జలగలుంటాయని తెలుసు కానీ ఆ జలగలు తమ బిగ్‌బాస్‌ను కూడా లక్ష్యపెట్టవనే సంగతి అంతవరకు తెలీదు.

"ఇలా కాదు కానీ ముందు ఫైలు పైకి పంపి అప్రూవల్ తెప్పిస్తా. వీల్లు స్పాట్‌నెట్లా చూపించరో అప్పుడు చెబుతా" కుడితిలో పడ్డ ఎలకలా కుతకుతలాడాడు.

పై అధికారికి ప్రపోజల్ పంపి అవలీలగా అప్రూవల్ తెప్పించుకున్నాడు. శారద ఏదో మాటవరసకు అంటుందనుకున్నాను కానీ శేఖర్ అఖండుడే.

పట్టణం చాలా పెద్దది. పార్కులు కూడా చాలానే ఉన్నాయి. కానీ... ఫలానా పార్కు ఎక్కడుందంటే అందరూ మ్యాపులో చూపించేవారే కాని ప్రాక్టికల్‌గా తీసుకెళ్లి స్పాట్ చూపించే వారెందరున్నారు ? ఇక్కడే పుట్టి పెరిగి ఇదే మున్సిపాలిటీలో ఉద్యోగం సంపాదించి, ట్రాన్స్‌ఫర్ సుడిగుండాలను చాకచక్యంగా దాటవేస్తూ పాతుక పోయిన సీనియర్ ఉద్యోగులకు మాత్రమే సరిగ్గా తెలుస్తుందని శేఖర్‌కు తెలుసు. అందులో ఒకరు సీనియర్ అటెండర్. స్పాట్‌కు వెళ్దామనగానే చలిజ్వరం వచ్చినట్టు వణికిపోతూ ఇప్పుడు తనా స్పాట్‌ను గుర్తించలేనన్నాడు. ఇంకొకరు జీపు డ్రైవర్. అతడు తప్పించుకోలేకపోయాడు.

జీపులో తన పక్కన నన్ను కూడా కూర్చోమన్నాడు శేఖర్. మాతోపాటు మరోముగ్గురు... బిల్ కలెక్టర్లున్నారు. అందులో ఒకాయన ఊరికి పాత, ఉద్యోగానికి కొత్త, సాయంత్రం ఆరు దాటింది. జీపు మెయిన్‌రోడ్డు దాటి కాలనీలలో పరుగెడుతోంది.

"ఏరా... డబ్బు రెడీ చేసుకున్నావా ?" కనుబొమలెగరేశాడు శేఖర్. చేసుకున్నానన్నాను. జీపు కొన్ని బంగళాలను దాటేసి ఓ బంగళా ముందాగింది. స్ట్రీట్ లైట్స్ సమర్థవంతంగా వెలుగుతున్నై.

"మీరన్న స్పాట్ ఇదేసార్ !" జీపు దిగాడు డ్రైవర్.

ముందున్నది రెండస్తుల బంగళా.

ఇంటిముందు అరటిచెట్లు, పూలమొక్కలు... చూడముచ్చటగా ఉంది. చుట్టూరా ఇళ్లు. రోడ్డుమీద వాహనాలు. ఎటు చూసినా... పార్కు కాదు కదా నేలమీద ఓ గడ్డిపరక కూడా కనబడ్డం లేదు. గానుగకు కట్టేసిన గంగిగోవులా ఉంది శేఖర్ పరిస్థితి. నాకు నవ్వాగలేదు. మూతి మూసుకుని వాణ్ణి ఎగాదిగా చూశాను. వాడు అసహనంగా డ్రైవర్ ముందుకెళ్లి

"నీకేమన్నా పిచ్చి పట్టిందా ?" గుర్రుమన్నాడు.

"లేద్సార్"

"మరి... పాడుబడ్డ పార్కు చూపించమంటే ఫస్ట్‌క్లాస్ కాలనీలోకి తెచ్చావెందుకూ ?"

"మన మ్యాపు తయారయేప్పుడిది పాడుబడ్డ పాత పార్కు. రానురాను ఇట్లా మారిపోయింది సార్".

శేఖర్ నోరుతో పాటు బంగళాగేటు బార్లా తెరుచుకుంది. లుంగీ మీదున్న సీనియర్ సానిటరి ఇన్‌స్పెక్టర్ చిరునవ్వుతో బయటకొచ్చి,

"వెల్‌కం... రండి... ఇది మాఇల్లే సార్ !" స్వాగతించాడు. మూగదయ్యాల్లా కదుల్తూ ఇంట్లోకెళ్లి కూర్చున్నాం. బిల్‌కలెక్టర్లు, డ్రైవర్‌వైపు చూస్తూ పెదాలు కదలకుండా నవ్వుకుంటున్నారు.

సీనియర్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ చాయ్ కప్పులందిస్తూ,

"ఏం సార్ ! అలాగున్నారేంటీ ? మాఇల్లు బాగాలేదా ?" అడిగాడు. వేడిచాయ్ నరాలను కదిలించింది. శేఖర్ గంభీరంగా మారాడు.

"ఇది పాడుబడ్డ పార్కా లేక మీ ఇల్లా ?"

"రెండూ సార్ !"

కరంట్ షాక్ కొట్టినట్టు జడుసుకున్నాం.

"ఆఁ... అదెట్లా ?" శేఖర్ గొంతులో గురగుర.


"మన మ్యాపు ప్రకారం ఇది పాడుబడ్డ పాత పార్కే, కాని... ప్రాక్టికల్‌గా కొత్త కాలనీ. ఇంతకు ముందొచ్చిన కమీషనర్లు వంతుల వారీగా కమీషన్ బేసిస్ మీద అమ్మేసి దీన్నిలా మార్చేశారు. పాపం ! మీకేమీ మిగల్లేదు సార్"

"ఇది నా ఏరియానే సార్ !" ఏరియా బిల్‌కలెక్టర్ ఉత్సాహం వానాకాలం ఏరులా ఉప్పొంగింది. "అన్నట్టూ... మొన్నటి జన్మభూమి కార్యక్రమాల్లో ఇక్కడి మట్టిరోడ్డును తార్రోడ్డుగా మనమే మార్చేశాం సార్. ఆ బిల్ పాస్ చేసింది తమరే సార్"

నవ్వాలో ఏడవాలో అర్థంకాక కుడితిలో ఎలుకలాగై పోయింది నా పరిస్థితి. అర్థగంట క్రితం మధ్యాహ్న మార్తాండుడిలా వెలిగిపోయిన శేఖర్ ముఖారవిందము నిప్పుల మీద కాల్చిన వంకాయలాగైంది. అతి కష్టంగా నోరు తెరుచుకుంది.

"అయితే ... ఇది పేపర్ పార్కన్న మాట !"

"అవున్సార్ ! మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకుంటోంది కదా ! మీరు కూడా మరో పార్క్‌ను సెలెక్ట్ చేసుకోండి సార్ !" పక్కింట్లోంచి పరుగెత్తుకొచ్చిన కాశయ్య లుంగీ సవరించుకున్నాడు.



**9 మార్చి, 2002**
**ఆంధ్రప్రభ వారపత్రికలో**
**ప్రచురితమైంది.**